

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,05,873లు, బంగారం 550 మిల్లీగ్రాములు, వెండి 59గ్రాముల 400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రక్తదానంపై అవగాహన అవసరం

రక్తదానం ఆవశ్యకతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి పిలుపునిచ్చారు.

- 8లో



ప్రైవేటు బస్సు బోల్తా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన ఎనిమిది మంది గాయపడ్డారు.

- 8లో

న్యూస్‌రీల్

పూరీ జగన్నాథ ఆలయం కూల్చేస్తాం



ప్రాకార గోడలపై బెదిరింపు రాతలు

భువనేశ్వర్ : పూరీ జగన్నాథుని మందిరం కూల్చేస్తామని ప్రాకార గోడల మీద ఉగ్రవాద బెదిరింపు రాతలు తీవ్ర కలకలం రేపాయి. వీటిని ఉగ్రవాద రాతలుగా భావిస్తున్నారు. బుఢి మా మందిరం గోడపై రెండు చోట్ల ఈ రాతలు కనిపించాయి. దీంతో ఆలయ పరిసరాలలో భద్రత పటిష్టం చేశారు. గోడపై రాసిన రాతల్లో సూచించిన నంబర్‌కు ఫోన్ చేయమని భద్రతా వర్గాలకు సవాల్ విసరడం గమనార్హం . ఈ రాతల్లో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేరు సైతం చోటు చేసుకుంది. ఇది ఎవరు ఎందుకు చేశారో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో నుజ్జయిన కారు

భువనేశ్వర్: పశుమాంసం రవాణా చేస్తున్న కారు ట్రక్కును ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ దుర్మరణం చెందాడు. రౌర్కెలా నుంచి సంబలపూర్‌కు పశువుల మాంసం తరలిస్తుండగా జమ్ముబహల్ సమీపంలో కారు నియంత్రణ కోల్పోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరి దర్యాప్తు ప్రారంభించారు.

గంజాయి కేసులో తీర్పు వెల్లడి

- నిందితుడు నిర్దోషి

రాయగడ: గంజాయి అక్రమ రవాణా కేసులో తీర్పు వెలువడింది. కేసును విచారించిన గుణుపూర్ ఏడీజేఎం దేవదత్త పట్నాయక్ నిందితుడు నిర్దోషిగా తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే 2024 జూన్ 21వ తేదీన గుణుపూర్ సమితి భీమాపూర్ కూడలిలో రెండు బస్తాలతో ఉన్న 40 కిలోల గంజాయిని అబ్కారీశాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో పట్టుకున్నారు. గంజాయి రవాణాతో సంబంధం ఉందంటూ ప్రశాంత్ మాఝి అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కేసు విచారణకు రావడంతో సాక్షులను విచారించిన న్యాయస్థానం నిందితుడు ప్రశాంత్ మాఝి గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసును ఏడీజేఎం కొట్టివేయడంతో పాటు ప్రశాంత్ మాఝి నిర్దోషని తీర్పునిచ్చారు.

హరిజన పద ప్రయోగం వద్దు

భువనేశ్వర్: రాష్ట్రంలో అన్ని విభాగాలు, శాఖలు, ప్రభుత్వ సంస్థలు, విద్యా సంస్థలు అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు, సమాచార వ్యవహారాల్లో 'హరిజన్' అనే పద వినియోగం , ప్రయోగం నివారించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదం బదులుగా రాజ్యాంగబద్ధమైన 'షెడ్యూల్డ్ క్యాస్ట్'ను ఆంగ్లంలో , ఒడియాలో దాని తగిన అనువాదాన్ని ఉపయోగించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర షెడ్యూల్డ్ తెగలు, కులాల అభివృద్ధి, బలహీన – వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

స్కూల్ బస్సును ఢీకొట్టిన వ్యాన్

- విద్యార్థులకు స్వల్పగాయాలు



ధ్వంసమైన బస్సు ముందు భాగం

రాయగడ: అదుపుతప్పిన పికప్ వ్యాన్ ఎదురుగా వస్తున్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం దెబ్బతినగా.. అందులో ఉన్న విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సదరు సమితి అమలాభట్ట వద్ద బుధవారం ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న చందిలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వ్యాన్‌ను స్వాధీనం చేసుకోగా డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సుమారు 50 మంది విద్యార్థులతో పెంట గ్రామం వైపు బస్సు వస్తున్న సమయంలో జేకేపూర్ నుంచి లెరువలి వైపు వెళుతున్న పికప్ వ్యాన్ అమలాభట్ట కూడలిలో అదుపుతప్పి బస్సును ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది.

మహిళల భద్రతకు ప్రాధాన్యం



శాంతిభద్రతల సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

- నిందితులను ఉపేక్షించవద్దు
- శాంతిభద్రతల సమీక్షలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రంలో శాంతిభద్రతలను బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితులపై బుధవారం లోక్ సేవా భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం పలు ఆదేశాలు జారీ చేశారు.

- మహిళల భద్రతలో తప్పిదాల్ని ఏమాత్రం సహించేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ విషయంలో పోలీసులు త్వరితగతిన ప్రతిస్పందించి పటిష్టమైన పర్యవేక్షణతో సత్వర కార్యాచరణకు సన్నద్ధంగా ఉండాలన్నారు.
- పాఠశాలలు, కళాశాలల సమీపంలో పోలీసులు పహారా కాయాలని అవాంఛనీయ సంఘటనలు నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
- గత ఏడాది 8,035 మంది మహిళలు, 3,306 మంది బాలికలను పలు విపత్కర పరిస్థితుల్లో రక్షించారని, ఈ చర్యలు మరింత ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు.
- పొరుగు రాష్ట్రాల నుంచి బ్రౌన్ షుగర్ వంటి మాదకద్రవ్యాల రవాణా కట్టడి కట్టుదిట్టం చేయాలని సీఎం ఆదేశించారు. ఈ ద్రవ్యాల రవాణా గొలుసు వ్యవస్థని ఛేదించేలా వ్యూహాత్మక చర్యలతో పోలీసులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
- బలమైన పోలీసు దళం కోసం ఖాళీ ఉద్యోగాల భర్తీ వేగవంతం చేయాలని సూచించారు. ఈ మేరకు కొత్త పోలీసు నియామక బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
- గంజాయి సాగు, సంబంధిత అక్రమ రవాణాపై చర్యలను అడ్డుకోవాలని సూచించారు.
- అక్రమ ఆయుధ వ్యాపారం, ఇసుక అక్రమ రవాణాను అరికట్టడం, బెయిల్ లేని వారెంట్లను అమలు చేయడంలో పోలీసుల చర్యలను ముఖ్యమంత్రి ప్రశంసించారు.

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

పర్లాకిమిడి: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు సేవించడం జీవితం నాశనమవుతుందని ఎస్పీ జ్యోతింద్రనాథ్ పండా అన్నారు. జిల్లా నుంచి గంజాయి అక్రమంగా ఇతర రాష్ట్రాలకు రవాణా అవుతోందని, ఈ ప్రాంతంలో 0.5 శాతం మాతం గంజాయి వినియోగిస్తున్నట్టు సమాచారం ఉందన్నారు. స్థానిక సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో బుధవారం మత్తు పదార్థాల విముక్తి భారత్ అభియాన్ నిర్వహించారు. కలెక్టర్ మధుమిత, జిల్లా అబ్కారీ శాఖ సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహు, సబ్ కలెక్టర్ అనుప్ పండా, డీన్ (అగ్రికల్చర్) ఎస్.పి.నందా, డైరక్టర్ (అడ్మిషన్) దుర్గాప్రసాద్ పాఢి, సామాజిక భద్రత, దివ్యాంగుల సాధికారత శాఖ అధికారి ఎల్.సంతోష్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొందరు విద్యార్థులు చదువులో ఒత్తిడి వల్ల మాదకద్రవ్యాలైన గంజాయి, సిగరెట్లు, ఛరాస్ సేవనం వల్ల తాత్కాలిక ఉపశమనం కలిగినా తర్వాత జీవితాంతం బాధపడాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో వార్డెన్లు, అధ్యాపకులు ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ చేయాలన్నారు. తాను యూట్యూబ్, ఇన్‌స్టామ్‌గ్రామ్ వేదికగా ఒత్తిడిని ఎదుర్కొనేందుకు సలహాలు, సూచనలు ఇస్తున్నానని చెప్పారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీన్ రితీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టర్ మధుమిత బీటెక్ (అగ్రికల్చర్)విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న సెంచూరియన్ వర్శిటీ విద్యార్థులు



వ్యవసాయ ప్రదర్శన తిలకిస్తున్న కలెక్టర్

కలక్టర్ దృష్టికి డొంగిరియాల సమస్యలు



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న డొంగిరియా ప్రజలు

రాయగడ : కలెక్టర్ అశుతోష్ కులకర్ణిని ఆదిమ తెగకు చెందిన డొంగిరియా ఆదివాసీలు మంగళవారం భేటీ అయ్యారు. జిల్లాలోని బిసంకటక్ సమితి కుర్లి పంచాయతీ, మునిగుడ సమితి మునిఖొల్ పంచాయతీ, కల్యాణసింగుపూర్ సమితి పర్శాలి పంచాయతీలకు చెందిన డొంగిరియా ప్రజలు తమ ప్రాంత సమస్యలను వివరించారు. నియమగిరి పర్వత ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా తమకు అందడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సమాజ సేవకుడు, డొంగిరియా తెగ ప్రతినిధి జితు జకసిక తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ముందే పంచాయతీల పునర్ వ్యవస్థీకరణ

- మంత్రి రబీ నాయక్



మాట్లాడుతున్న మంత్రి రబీ నాయక్

భువనేశ్వర్: రాష్ట్రంలో పంచాయతీలను పునర్ వ్యవస్థీకరించాలని నిర్ణయించామని రాష్ట్ర పంచాయతీరాజ్, రక్షిత మంచినీటి విభాగం మంత్రి రబీ నాయక్ వెల్లడించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర గవర్నర్ ప్రతిపాదన మేరకు పంచాయతీలను బలోపేతం చేయడానికి 2027 సంవత్సరానికి ముందుగానే పునర్నిర్మిస్తామన్నారు. అలాగే 2029 సంవత్సరానికి ముందుగానే కొత్త మండలాలు ఏర్పాటు అవుతాయన్నారు. పంచాయతీ రాజ్, తాగునీరు శాఖల సమీక్ష సమావేశంలో మంగళ వారం రాష్ట్ర గవర్నర్ పంచాయతీల పెంపు ప్రతిపాదించారన్నారు. పంచాయతీరాజ్ చట్టం కింద పంచాయతీని బలోపేతం చేయాలని గవర్నర్ ప్రతిపాదించారని మంత్రి తెలిపారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు కొత్త మండలాలు ఏర్పాటు చేస్తారన్నారు. వీటి కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. కమిటీ సిఫారసుల మేరకు కొత్త పంచాయతీలు, మండలాల రూపురేఖలు ఖరారు చేస్తారని మంత్రి వివరించారు.

బీజేపీ జాతీయ అధ్యక్షుడితో రాష్ట్ర ప్రముఖుల భేటీ



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులు

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో ఉన్నత స్థాయి వర్చువల్ సమావేశంలో ఒడిశా అగ్ర నాయకత్వం భేటీ అయ్యింది. ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రులు కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా, మంత్రులు డాక్టర్ ముఖేష్ మహాలింగ్, గణేష్ రామ్‌సింగ్ ఖుంటియా ఈ సమావేశంలో పాల్గొన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు సునీల్ బన్సాల్, వినోద్ తావ్డే సమన్వయంలో జరిగిన ఈ సమావేశంలో ఒడిశా అభివృద్ధి రోడ్ మ్యాప్, పార్టీ సంస్థాగత ప్రాధాన్యతలపై చర్చించారు. బీజేపీ పాలిత అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, ఆరోగ్య శాఖ, అటవీ పర్యావరణ విభాగం, పట్టణాభివృద్ధి, యువజన వ్యవహారాలు, క్రీడలు, సాంస్కృతిక శాఖల మంత్రులు వర్చువల్‌గా సమావేశంలో పాలుపంచుకున్నారని ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా తెలిపారు.

ఆర్టీసీ బస్సు బోల్తా



పొలంలో బోల్తాపడిన బస్సు

- పది మందికి గాయాలు

రాయగడ: పూరీ నుంచి కోట్‌పాడ్‌కు వెళ్తున్న ఓఎస్ఆర్టీసీ బస్సు జిల్లాలోని పద్మపూర్ పోలీస్ స్టేషన్ పరిధి అకుసింగి వద్ద బుధవారం తెల్లవారుజామున ప్రమాదానికి గురయ్యింది. బస్సు అదుపుతప్పి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పది మంది ప్రయాణికులు గాయాలపాలయ్యారు. సమాచారం తెలుసుకున్న పద్మపూర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో ఇరుక్కుపోయిన ప్రయాణికులను అగ్నిమాపక సిబ్బంది బయటకు తీసి పద్మపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. బస్సు డ్రైవర్ను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై ఆరాతీస్తున్నారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. కోట్‌పాడ్ వెళ్లేందుకు పూరీలో మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు బస్సు బయలు దేరింది. ఈ సమయంలో 50 మంది ప్రయాణికులు ఉన్నారు. మార్గమధ్యలో ఒక డాబావద్ద బస్సును నిలిపి ప్రయాణికులు భోజనాలు చేసిన అనంతరం అక్కడ నుంచి తిరిగి అర్ధరాత్రి 12 గంటలకు బయలుదేరింది. ఈ క్రమంలోనే పద్మపూర్ సమీపంలోని అకుసింగికి బస్సు చేరే క్రమంలో బుధవారం వేకువ జామున మూడు గంటల సమయంలో బస్సు అదుపుతప్పి పంటపొలాల్లోకి బోల్తా పడింది.

మద్యం మత్తులో డ్రైవర్

డాబా వద్ద బస్సును ఆపినప్పుడు డ్రైవరు మద్యం తాగినట్టు కొందరు ప్రయాణికులు ఆరోపించారు. మద్యం మత్తులో బస్సును డ్రైవర్ నడపడంతోనే ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. పెద్ద శబ్దంతో బస్సు బోల్తాపడడంతో భయంతో కేకలు వేశామని చెప్పారు. సెల్‌ఫోన్ల టార్చ్‌లైట్ల సహాయంతో బస్సు లోపల నుంచి ప్రాణాలతో బయటకు వచ్చామన్నారు. బస్సులో ఇరుక్కుపోయిన పది మందిని అగ్నిమాపక సిబ్బంది అతికష్టం మీద బయటకు తీయగలిగారని చెప్పారు.



ప్రమాదానికి గురైన బస్సు



బస్సులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది



గాయాలతో క్షతగాత్రులు

విజిలెన్స్ వలలో సీహెచ్‌సీ ఆరోగ్య కార్యకర్త



విజిలెన్స్ అధికారులకు చిక్కిన కుంజో బిహారి రౌత్

రాయగడ: జిల్లాలోని మునిగుడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో ఆరోగ్య కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న కుంజో బిహారి రౌత్ విజిలెన్స్ వలలో చిక్కుకున్నారు. సీహెచ్‌సీలో జన్మధృవపత్రం మంజూరు చేయడంలో భాగంగా ఒకరి నుంచి మూడు వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా కొరాపుట్ విజిలెన్స్ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు రౌతుకు సంబంధించి మునిగుడకు వెళ్లే రహదారిలోని డుకుం గ్రామంలో ఉన్న ఇళ్లల్లో అధికారులు సోదాలు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. సీహెచ్‌సీలో బర్త్ సర్టిఫికెట్ పొందాలంటే అందుకు ఆరు వేల రుపాయల లంచాన్ని రౌత్ ఒక రైతు వద్ద డిమాండ్ చేశాడు. ఇందులో భాగంగా మొదట మూడు వేల రూపాయలను కొద్దిరోజుల క్రితం ఆరోగ్య కార్యకర్తకు రైతు చెల్లించాడు. మిగతా మూడు వేల రూపాయలు చెల్లిస్తేగాని ధృవపత్రం ఇచ్చేదిలేదని మొండికేసి చెప్పడంతో బాధితుడు గత్యంతరం లేక విజిలెన్స్ అధికారులను ఆశ్రయించాడు. వారి సలహా మేరకు బుధవారం మూడు వేల రూపాయలను ఆరోగ్య కార్యకర్త కుంజొ బిహారి రౌత్‌కు అందజేస్తుండగా విజిలెన్స్ అధికారులు వలపన్ని పట్టుకున్నారు.

ముగ్గురు వలస కార్మికుల దుర్మరణం

- తెలంగాణలో ఘోర రోడ్డు ప్రమాదం
- బాధితులకు న్యాయం చేయాలని నబరంగ్‌పూర్ జిల్లాలో ప్రతిపక్షాల ఆందోళన



నబరంగ్‌పూర్ జిల్లా జోరిగాంలో ఆందోళన చేస్తున్న బీజేడీ మాజీ ఎంపీ రమేష్ చంద్ర మఝి



శేష్మన్ బోత్ర మృతదేహం

కొరాపుట్ : తెలంగాణా రాష్ట్రంలో ఒడిశాకు చెందిన ముగ్గురు వలస కార్మికులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ ఘటనలో మృతులకు న్యాయం చేయాలంటూ బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి కొకడాబెడా గ్రామంలో ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. మంగళవారం తెలంగాణా రాష్ట్రం రంగారెడ్డి జిల్లా కిసార పోలీస్ స్టేషన్ పరిధిలో సికిందర్ ఖమ్మం ప్రాంతంలో రోడ్డుపక్కన పంట భూమిలో వలస కార్మికులు మొక్కలు నాటుతున్నారు. ఈ సమయంలో వ్యాన్ దూసుకెళ్లడంతో కొకడాబెడా గ్రామానికి చెందిన జయరాం బోత్ర (56), నారాయణ బోత్ర (20), శేష్మన్ బోత్ర (21)లు అక్కడికక్కడే మృతి చెందారు. వీరి మృతదేహాలను తెలంగాణా ప్రభుత్వం నబరంగ్‌పూర్ జిల్లాకు బుధవారం పంపించింది. ఈ క్రమంలో మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. ఒడిశా రాష్ట్రంలో మైదాన ప్రాంతాలలో కార్మికులు మృతి చెందితే ప్రభుత్వం తక్షణ పరిహారం ప్రకటిస్తుందని గుర్తు చేశారు. వీరికి కూడా ఒడిశా ప్రభుత్వం పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జాతీయ రహదారిపై బీజేడీకి చెందిన మాజీ ఎంపీ రమేష్ చంద్ర మఝి, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే భుజబల్ మఝి, కెమరాజ్ బాగ్, హరావతి గొండో తదితరులు బైఠాయించి నిరసన తెలియజేశారు. మరోవైపు ఉమ్మర్‌కోట్ డివిజన్ నుంచి ఉపాధి కోసం తెలంగాణా వెళ్తున్న వారు వరుస ఘటనలో మృత్యువాత పడుతున్నారు. ఇటీవల రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో జిల్లాకు చెందిన ముగ్గురు కార్మికులు మృతి చెందారు. తాజాగా రోడ్డు ప్రమాదంలో మరో ముగ్గురు దుర్మరణం చెందడంతో కార్మికుల భద్రతపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాకు చెందిన సుమారు 50 వేల మంది వలస కార్మికులు ఇతర రాష్ట్రాలలో పని చేస్తున్నట్లు అంచనా. అందులో అత్యధికులు తెలంగాణా రాష్ట్రంలోనే పని చేస్తున్నారు.



నారాయణ బోత్ర మృతదేహం



ప్రమాదానికి కారణమైన వ్యాన్



జయరాం బోత్ర మృతదేహం

క్లుప్తంగా

32 వంతెనల నిర్మాణానికి ఆమోదం

భువనేశ్వర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025–26లో 'సేతు బంధన్' యోజన కింద రాష్ట్రంలో 12 జిల్లాల్లో 32 వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. బొలంగీర్, సువర్ణపూర్, నయాగడ్, సంబల్‌పూర్, మల్కన్‌గిరి, కొరాపుట్, జగత్‌సింగ్‌పూర్, బర్‌గడ్, బౌద్, భద్రక్, కటక్, పూరీ జిల్లాల్లో ప్రతిపాదిత వంతెనలు నిర్మిస్తారు.

అవయవదాత కుటుంబాలకు ఆర్థిక సాయం



కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న ఏడీఎం ఫాల్గుణీ మఝి

పర్లాకిమిడి: జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆశ్వాస్ హాలులో బుధవారం ప్రపంచ అవయవదాన దినోత్సవం నిర్వహించారు. చనిపోతూ పులువురికి అవయవదానం చేసిన ఐదుగురు వ్యక్తులకు సంబంధించి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం తరఫున సూరజ్ పురస్కారాలు 2025 పేరిట ఆర్థిక సహాయం అందజేశారు. సాయం అందుకున్న వారిలో పర్లాకిమిడి సేరి వీధికి చెందిన నర్సింహ ప్రసాద్ మహారాణా, పాటికోట గ్రామానికి చెందిన పి.శోబోరో, తెలుగు సాండివీధికి చెందిన కె.నారాయణ పట్నాయిక్, రాయగడ బ్లాక్ సన్నతుండి గ్రామానికి చెందిన అరుణ్ భుయ్యాన్ ఉన్నారు. వీరి కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున ఆర్థిక సహాయాన్ని ఏడీఎం ఫాల్గుణీ మాఝి అందజేశారు. కార్యక్రమంలో సి.డి.ఎం.ఒ. డాక్టర్ ఎం.ఎం.ఆలీ, అసిస్టెంట్ కలెక్టర్ జగన్నాథ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నీటిగుంతలో పడి యువకుడు మృతి



సోను గౌడ్ మృత దేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి పూజారిగూడ గ్రామంలో ఓ యువకుడు కాలు జారి నీటిగుంతలో పడి ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోనుగౌడ్ అనే యువకుడు రోజులాగానే బుధవారం పనికి వెళ్లాడు. వాటర్ ట్యాంక్ సమీపంలోని నీటిగుంత వద్ద పని చేస్తుండగా ప్రమాదవశాత్తు అందులో జారిపడిపోయాడు. అక్కడ ఉన్నవారు మాజీ సర్పంచ్ రామ్‌చంద్రకు సమాచారం ఇచ్చారు. ఆయన సమితి అధ్యక్షుడు సధశివ పూజారికు సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సోనును బయటకు తీసి మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారని పోలీసులు పేర్కొన్నారు. సోనుగౌడ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

'హర్‌ఘర్ తిరంగా' ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పర్లాకిమిడి మహిళా కళాశాల విద్యార్థినులు

పర్లాకిమిడి: రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు స్థానిక మహిళా కళాశాల విద్యార్థినులు 'హర్‌ఘర్ తిరంగా' ర్యాలీని డోలా ట్యాంక్ నుంచి ప్యాలస్ వీధుల మీదుగా బుధవారం నిర్వహించారు. ఈ ర్యాలీలో మహిళా కళాశాల అధ్యక్షురాలు డాక్టర్ రీనా సాహు, కళాశాల విద్యార్థిని సంఘం నాయకురాలు కల్పనా నాగవంశ, తదితరులు పాల్గొని వందేమాతరం నినాదాలు చేశారు.

ప్రైవేటు బస్సు బోల్తా

• ఎనిమిది మందికి గాయాలు



నూతలగుంటపాలెం వద్ద బోల్తా పడిన ప్రైవేటు బస్సు

కశింకోట: అనకాపల్లి జిల్లా కశింకోట మండలం నూతలగుంటపాలెం వద్ద బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ప్రైవేటు బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారు. ఎస్ఐ పి.మనోజ్‌కుమార్ అందించిన వివరాలు.. ఒడిశా రాష్ట్రం అడ్డుబంగి నుంచి హైదరాబాద్ వెళుతున్న బస్సు.. ముందు వెళుతున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి నూతలగుంటపాలెం రిలయన్స్ బంక్ వద్ద రోడ్డు పక్కనున్న పల్లపు ప్రాంతంలోకి బోల్తా పడింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 8 మంది గాయపడ్డారు. వారిని 108 వాహనంలో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారికి స్వల్ప గాయాలైనట్టు సమాచారం. ప్రమాదం జరిగే సమయంలో బస్సులో 37 మంది ప్రయాణిస్తున్నారు. ఘటనా స్థలాన్ని సీఐ అల్లు స్వామినాయుడు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు. గాయపడిన వారిలో భరతన్, కృష్ణారావు, పార్వతి, ఉమా, మాధవి, సనాతన రాయ్, పి.శ్రీరాములు, రాములమ్మ, బృందావతి, కె.మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

రక్తదానంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ డాక్టరు కంభంపాటి హరిబాబు

• విరివిగా శిబిరాలు ఏర్పాటు చేయాలి
• సదస్సులో గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు

భువనేశ్వర్: రక్తదానం ఆవశ్యకతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి పిలుపునిచ్చారు. రాజ్ భవన్ అభిషేక్ హాల్‌లో బుధవారం భారతీయ రెడ్ క్రాస్ సంస్థ, ఒడిశా రాష్ట్ర శాఖ కార్యనిర్వాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యా సంస్థల్లో సంవత్సరానికి కనీసం రెండు, మూడు సార్లు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు. రక్తదానం చేయడం అంటే మరొకరి ప్రాణాలను కాపాడటమేనని చెప్పారు. రక్తదానంపై నెలకొన్న అపోహలు తొలగించాలని సూచించారు. అనంతరం రాష్ట్రంలో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిపై సమీక్షించారు. రోగులకు రక్తం సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలికలు, మహిళల్లో హిమోగ్లోబిన్ స్థాయిలు తగ్గడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్, పాఠశాలలు, సామూహిక విద్య విభాగం మంత్రి నిత్యానంద గోండ్, గవర్నరు కమిషనర్, కార్యదర్శి రూప రోషన్ సాహు, భారతీయ రెడ్‌క్రాస్ సంస్థ కార్యనిర్వాహక మండలి సభ్యులు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, పంచాయతీరాజ్, తాగునీరు, పాఠశాలలు, సామూహిక విద్య, ఉన్నత విద్యా శాఖల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్ కార్యాలయం వద్ద రుణం చెల్లించిన పత్రాలతో మహిళలు

మల్కన్‌గిరి: రుణాలు చెల్లించినప్పటికీ తమను మోసం చేశారని మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితిలో స్వయం సహాయక సంఘాలకు చెందిన 20 మంది మహిళలు ఆరోపించారు. కోరుకొండ సమితి కేంద్రంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో తమకు డబ్బులు ఆశ చూపి రుణం ఇప్పిస్తామని కొంతమంది మోసం చేశారని ఆరోపించారు. ఈక్రమంలో బుధవారం ముందుగా బ్యాంక్‌కు తాళం వేసి అనంతరం మహిళలు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. 2024లో బ్యాంక్‌లో 20 మంది రూ. మూడు లక్షలు రుణం తీసుకున్నారు. బ్యాంక్ వారు ఇచ్చిన గడువులోగా తీసుకున్న రుణాన్ని చెల్లించారు. అయినా ఇంకా మీ గ్రూప్ సభ్యులు మూడు లక్షలు రుణం చెల్లించాల్సి ఉందని బ్యాంకు అధికారులు చెప్పడంతో ఆశ్చర్యపోయారు. ఆందోళనతో బ్యాంకుకు చేరుకొని తాళాలువేసి కలెక్టర్ సోమేష్ ఉపాధ్యాయను కలిసి బ్యాంకు అధికారులపై ఫిర్యాదు చేశారు. బ్యాంక్ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

దోపిడీ కేసులో ఆరుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

రాయగడ: సదరు సమితి శేఖాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జిమిడిపేట రైల్వే స్టేషన్ వద్ద ఈ నెల 3న రైలులో ప్రయాణిస్తున్న బంగారు వ్యాపారి నుంచి 150 గ్రాముల బంగారు ఆభరణాలు దొంగిలించిన కేసులో ఆరుగురు నిందితులను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 2.25 లక్షల నగదు, 58 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో స్థానిక రామకృష్ణనగర్‌కు చెందిన గోవిందబాగ్, కపిలాస్ కూడలికి చెందిన ఉల్లకల్లు శ్రీను, నెహ్రూనగర్‌కు చెందిన ఎ.బేనుగోపాల్‌స్వామి, ఉత్కళమణి నగర్‌కు చెందిన బిధిహార్‌బాగ్, రాణిగుడ ఫారానికి చెందిన పలక మురళీకృష్ణ, నెహ్రూనగర్‌కు చెందిన అగుర్ ఈశులుగా గుర్తించారు. ఈ మేరకు బుధవారం రైల్వే పోలీసులు విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న విశాఖపట్నం జిల్లా గాజువాకకు చెందిన ఆర్.ముళ్ల అనే నగల వ్యాపారి రాయగడకు ఇక్కడ గల బంగారు దుకాణాల యజమానులతో వ్యాపార లావాదేవీలు పూర్తయిన అనంతరం విజయవాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరాడు. జిమిడిపేట స్టేషన్ వచ్చేసరికి గుర్తు తెలియని దుండగులు వ్యాపారి వద్ద బ్యాగ్ లాక్కొని పారిపోయారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నారు.

సంబల్‌పూర్ పట్టణంలో..రాత్రీపగలూ నీటి సరఫరా



మంత్రి మండలిలో పాల్గొన్న ముఖ్యమంత్రి, మంత్రులు

• రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం

భువనేశ్వర్: పశ్చిమ ఒడిశా సంబల్‌పూర్ పట్టణానికి రాత్రీపగలూ నిరవధికంగా తాగునీటి సరఫరా ప్రాజెక్టుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన బుధవారం లోక్ సేవా భవన్ సమావేశం హాల్‌లో 24వ మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 6 శాఖల నుంచి 7 ప్రధాన ప్రతిపాదనలను మంత్రి మండలి ఆమోదించింది. ఒడియా భాష, సాహిత్యం, సంస్కృతి, సహకార, ఆర్థిక, వాణిజ్యం– రవాణా, ఆరోగ్య – కుటుంబ సంక్షేమ శాఖలు ఒక్కో ప్రతిపాదన, గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖ 2 ప్రతిపాదనలను మంత్రి మండలి ఆమోదానికి ప్రతిపాదించాయి. సమగ్రంగా ఈ 7 ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. సంబల్‌పూర్ పట్టణంలో రూ.382.40 కోట్ల వ్యయ ప్రణాళికతో రాత్రీపగలూ తాగునీటి సరఫరా ప్రాజెక్టుకు మంత్రి మండలి ఆమోదించింది. ఈ ఆమోదం ప్రకారం ఈగిల్ ఇన్‌ఫ్రా ఇండియా లిమిటెడ్ 2043 నాటికి ప్రాథమిక అంచనా ప్రకారం రూ.7 లక్షల మందికి ఆమోదిత తాగునీటి సరఫరా సేవలందించేదుకు ఇన్‌టేక్ బావులు, నీటి శుద్ధి కర్మాగారం, టర్బైన్ పంపులను నిర్మిస్తుంది. రూ. 300 కోట్ల రాష్ట్ర వ్యయ ప్రణాళికతో తొలి విడతలో 14 భారీ, 17 మధ్య, 7 చిన్న తరహా మండీల ఏర్పాటుకు మంత్రి మండలి మార్గం సుగమం చేసింది. ఈ మండీల్లో అధునాతన నిల్వ, పంటకోతలో డిజిటల్ వ్యవస్థ, పంటలకు సరసమైన ధరల నిర్ధారణ, వరి సేకరణలో పారదర్శకత, పంటల తర్వాత నష్టాల నియంత్రణకు అనుబంధ సౌకర్యాలతో సమగ్రంగా 38 ఆదర్శ మండీలను ఏర్పాటు చేయడానికి మంత్రి వర్గం అంగీకరించింది. 110 పట్టణ స్థానిక సంస్థలలో విద్యుచ్ఛక్తి వినియోగం తగ్గించే దృక్పథంతో రెట్రోఫిట్టింగ్ స్విచ్‌లలో ఎల్‌ఈడీ పబ్లిక్ స్ట్రీట్ లైటింగ్ కోసం నిధులు మంజూరు చేసేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. మాస్ పథకం కింద భువనేశ్వర్‌లోని బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రపంచ శ్రేణి ఎంఆర్‌ఓ (నిర్వహణ, మరమ్మతు, ఓవర్‌హాల్) సౌకర్యం కల్పించేందుకు ఎయిర్ వర్క్స్ ఇండియా సంస్థకు ఐపీఆర్ 2022 కింద ప్రోత్సాహకాలను విస్తరించారు. ఈ ప్రాజెక్ట్ కింద ఒడిశాను ప్రాంతీయ విమానయాన కేంద్రంగా అభివృద్ధి చేసి 2031 నాటికి అంచనా ప్రకారం 117 అమెరిన్ బిలియన్ల డాలర్ల సామర్థ్యంతో ప్రపంచ ఎంఆర్‌ఓ మార్కెట్‌లో రాష్ట్రం ఉనికిని బలపరచుకుంటుంది. ప్రభుత్వ సంస్థలలో నర్సింగ్ అధ్యాపక నియామకం మరియు పదోన్నతి విధానాల కోసం మంత్రి మండలి ప్రతిపాదిత ఒడిశా నర్సింగ్ ఎడ్యుకేషన్ సర్వీస్ రూల్స్, 2025ను ఆమోదించింది. ఈ తీర్మానంతో ప్రస్తుతం పని చేస్తున్న 8 నర్సింగ్ కళాశాలలు, 21 ఏఎన్ఎం శిక్షణ కేంద్రాలు, 7 కొత్తగా ఏర్పాటు కానున్న కళాశాలల్లో ఖాళీల భర్తీని పరిష్కరిస్తుంది. ఆయా సంస్థల్లో నాణ్యమైన బోధనను నిర్ధారించి నర్సింగ్ విద్యను బలోపేతం చేస్తుంది. సాంస్కృతిక నిర్వహణ, సమన్వయంతో రాష్ట్ర మ్యూజియం పనితీరును మెరుగుదల కోసం ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు, సీటీ, జీఎస్టీ కార్యాలయాలలో ఒడిశా మినిస్టీరియల్ సేవల నియమాల ప్రతిపాదనలు మంత్రి మండలి ఆమోదం పొందాయి.

విజిలెన్స్ వలలో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు



క్లర్క్ జగదీష్ పట్నాయక్



అటెండర్ నిరంజన్ నాయక్

• రూ.25 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

పర్లాకిమిడి: స్థానిక జిల్లా ముఖ్యవైద్యాధికారి కార్యాలయంలో పనిచేస్తున్న గుమస్తా జగదీష్ పట్నాయక్, అటెండర్ నిరంజన్ నాయక్‌లు ఒక యువ డాక్టర్ వద్ద నుంచి రూ.25 వేల లంచంగా తీసుకుంటుండగా విజిలెన్స్ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 12న కాంట్రాక్ట్ డాక్టర్‌గా ఉద్యోగం పొందిన వ్యక్తి అపాయింట్‌మెంటు లెటర్ కోసం సి.డి.ఎం.ఓ. కార్యాలయానికి వెళ్లారు. గుమస్తా జగదీష్ పట్నాయక్, ప్యూన్ నిరంజన్ నాయక్ రూ.25 వేల లంచం డిమాండ్ చేశారు. దీంతో ఆయన విజిలెన్స్ అధికారులకు తెలియజేయడంతో వలపన్ని పట్టుకున్నారు. వెంటనే ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. జగదీష్ పట్నాయక్ ప్రభుత్వ క్వార్టర్, కార్యాలయంలోని ఆయన సీటు అల్మారా, డెస్‌లో వెతకగా సుమారు రూ.5 లక్షలు ఉండటంతో వాటిని సీజ్ చేశారు. ఈ దాడుల్లో బరంపురం విజిలెన్స్ పాల్గొన్నారు. ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులపై కేసు నమోదు చేసి, కస్టడీలోకి తీసుకున్నట్లు అధికారులు తెలియజేశారు.

ఉపాధ్యాయుడు అరెస్ట్



అరెస్ట్ అయిన ప్రతాప్ కుమార్ నాయక్

పర్లాకిమిడి: మావోయిస్టులతో సంబంధం కలిగివున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిని బుధవారం అడవ పోలీసులు అరెస్టు చేశారు. గజపతి జిల్లా మోహానా నియోజకవర్గం అడవ పి.ఎస్ పరిధిలో నువా ఖోజురిపద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గత కొద్ది నెలలుగా ఎక్స్‌క్యాడర్ టీచర్‌గా ప్రతాప్ కుమార్ నాయక్ పనిచేస్తున్నారు. 2011లో అడవలో అంధేరీ ఘాట్ మావోయిస్టుల బ్లాస్టింగ్, 2013లో మోహనా పి.ఎస్.పరిధిలో భలియాగుడలో జరిగిన మావోల హింసాకాండలో ప్రతాప్ నాయక్ ఉన్నట్టు అడవ పోలీసులు వెల్లడించారు. ఆయనపై అడవ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. ఆర్.ఉదయగిరి పోలీసు స్టేషన్‌లో మరి కొన్ని కేసులు ఉన్నట్టు జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా తెలియజేశారు. ఉపాధ్యాయుడు ప్రతాప్ గతంలో మావోయిస్టు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నట్టు ఎస్పీ తెలియజేశారు. ఈ రెండు కేసులు ఆధారంగా ప్రతాప్ కుమార్ నాయక్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలియజేశారు. అడవ, మోహానా, ఆర్.ఉదయగిరిలలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మరి కొంతమంది ఉపాధ్యాయులు నక్సల్, గంజాయి రవాణా కేసుల్లో ఉన్నారని, వారు ఆయా పోలీసు స్టేషన్లలో స్వచ్ఛందంగా లొంగిపోవాలని, లేకుంటే వారిని ఎక్కడున్నా పట్టుకుని అరెస్ చేస్తామన్నారు.

కాయగూరల దుకాణాలు తొలగించాలి



దుకాణదారులతో మాట్లాడుతున్న అధికారులు

జయపురం: జయపురం ప్రధాన మార్గంలో ట్రాఫిక్ సమస్య నియంత్రించేందుకు ఇరువైపులా కాయగూరల దుకాణాలను తొలగించాలని మున్సిపాలిటీ అధికారులు నిర్వాహకులను ఆదేశించారు. స్వచ్ఛందంగా తొలగించకపోతే మున్సిపాలిటీ సిబ్బంది తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు జయపురం మునిసిపాలిటీ కార్యనిర్వాహక అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ కుమారి అక్కవరం శొశ్యా రెడ్డి ఆదేశాల మేరకు అదనపు కార్యనిర్వాహక అధికారి పూజా రౌత్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది, పోలీసులు రాజానగర్ కూడలి నుంచి దుకాణదారులకు స్పష్టం చేశారు.

శ్రీమందిరంలో నాలుగు గంటలు దర్శనాలు నిలిపివేత



రాహు రేఖ అలంకరణలో జగన్నాథ స్వామి

భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరంలో బుధవారం మూల విరాట్టు దర్శనం తాత్కాలికంగా నిలిపివేశారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు నాలుగు గంటల సేపు సర్వ దర్శనం నిలిపి వేశారు. శ్రీ మందిరం రత్న వేదికపై శ్రీ జగన్నాథుని రాహు రేఖ సేవ పురస్కరించుకుని సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపి వేయడం అనివార్యమైనట్లు ఆలయ అధికార వర్గాలు తెలిపాయి. ఏటా భాద్రపద మాసం కృష్ణ పక్ష రేఖా పంచమి నాడు రాహు రేఖను అలంకరిస్తారు. ఇది గోప్య సేవ కావడంతో బుధ వారం సాయంత్రం నాలుగు గంటల పాటు దర్శనం ఆపి వేశారు.ప్రథమ భోగ మండప సేవ తర్వాత రాహు రేఖ సన్నాహాలు ప్రారంభించారు. రాహు రేఖ శ్రీ జగన్నాథుని ముఖాన ధగేలుమనే అర్థ వలయ ఆకార బంగారు ఆభరణం. స్నాన పూర్ణిమ పురస్కరించుకుని దీనిని తొలగించారు. తిరిగి భాద్రపద మాసం కృష్ణ పక్షం పంచమి నాడు ఈ అలంకరణ పునరుద్ధరించడం ఆచారం. గోపాల వల్లభ్ భోగం నివేదన తర్వాత తొఢా కొరొణా, దెవులొ కొరొణొ సేవకులు భండార్ మేకాప్ సేవకులతో సంప్రదించి రత్న భాండాగారంలో పదిల పరిచిన బంగారు రాహు రేఖను బయటకు తీస్తారు. బెహెరెణొ ద్వారం దగ్గర ఆలయ కంసాలి సేవకులు రాహు రేఖను శుభ్రం చేసి అలంకరణకు సిద్ధం చేస్తారు. ప్రథమ భోగ మండప సేవ ముగియడంతో పాలియా సేవకులు, దైతపతులు గర్భ ఆలయం లోనికి ప్రవేశించి జయ, విజయ ద్వారం తలుపులు మూసి వేసి గోప్యంగా రాహు రేఖ అలంకరణ చేశారు. ఆలయ ఆచారం ప్రకారం ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత మూల విరాటులకు మహా స్నానం చేయించారు.

ఊరూరా జాతీయ జెండాల ర్యాలీ



వందమీటర్ల జాతీయ జెండాతో విద్యార్థుల ఊరేగింపు

రాయగడ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక అటానమస్ కళాశాలకు చెందిన విద్యార్థులు వంద మీటర్ల పొడవైన జాతీయ జెండాతో బుధవారం పట్టణంలో ఊరేగింపు చేపట్టి తమ దేశభక్తి చాటుకున్నారు. మద్యం మానుకోవాలంటూ చైతన్య ర్యాలీని నిర్వహించారు.

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఇంటింటా త్రివర్ణ పతాకం ఎగురవేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శంకర కెరకెటా పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆర్.ఉదయగిరిలో మంగరాజ్‌పూర్, కాశీనగర్ సమితిలో ఖరడ గ్రామాల్లో బ్లాక్ అధికారులు, స్వయం సహాయక గ్రూపులు జాతీయ జెండాలను పంపిణీ చేశారు.



కాశీనగర్ బ్లాక్ ఖరడ గ్రామంలో త్రివర్ణ పతాకాలు

లైంగికదాడులు, శిశు సురక్ష చట్టాలపై అవగాహన



ప్రసంగిస్తున్న ప్రదీకరణ కార్యదర్శి ప్రద్యోమయి సుజాత

జయపురం: కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం ద్వారా జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం అధ్యక్షులు ప్రదీప్ కుమార్ మిశ్ర పర్యవేక్షణలో స్థానిక సరస్వతీ శిశు విద్యాలయం శారదా విహార్‌లో లైంగిక నేరాలు, శిశు సురక్షా చట్టం -2012పై చైతన్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి ప్రద్యోమయి సుజాత పాల్గొని మాట్లాడారు. పోస్కో చట్టం లింగభేదం లేకుండా శిశు సంక్షేమం, సురక్షణ కోసం తగిన వ్యవస్థను నెలకొల్పిందని వెల్లడించారు. శిబిరంలో స్పెషల్ పోస్కో కోర్టులో అవిభక్త కొరాపుట్ జిల్లా స్పెషల్ పీపీ డాక్టర్ బి.గాయిత్రీ దేవి, డిప్యూటీ లీగల్, లీగల్ డిఫెన్స్ కౌన్సిలర్, పేనల్ న్యాయవాది పి.సన్యాసిరావు, సరస్వతీ శిశు విద్యాలయ సారదా విహార్ ప్రధాన ఆచార్య సత్యనారాయణ సెఠి, సరస్వతీ శిశు విద్యా మందిర్ శారద విహార్ విద్యార్థి న్యాయ సాక్షరత క్లబ్బు ఉపాధ్యాయులు రమేష్ చంద్రబెహర పాల్గొన్నార. ఈ సందర్భంగా 9, 10 తరగతుల విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు న్యాయ సేవ ప్రదీకరణ కార్యదర్శిణి సుజాత ప్రశంసా పత్రాలు, ట్రోఫీలతో సత్కరించారు.



వక్తృత్వ పోటీలో మాట్లాడుతున్న విద్యార్థిని





బహుమతులు అందుకుంటున్న విజేతలు

ఎమ్మెల్యే ఎల్‌ఏడీ వెబ్ పోర్టల్ ప్రారంభం



లోక్ సేవా భవన్‌లో ఎమ్మెల్యే ఎల్‌ఏడీ వెబ్ పోర్టల్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



ఎమ్మెల్యే ఎల్‌ఏడీ వెబ్ పోర్టల్

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ బుధవారం లోక్ సేవా భవన్‌లో రాష్ట్ర మంత్రి మండలి సమక్షంలో ఎమ్మెల్యే స్థానిక ప్రాంత అభివృద్ధి (ఎమ్మెల్యే–ఎల్‌ఏడీ), ముఖ్యమంత్రి ప్రత్యేక సహాయం (సీఎం–ఎస్‌ఏ) పథకాలకు సరళీకృత మార్గదర్శకాల సంచికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే ఎల్‌ఏడీ వెబ్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ కొత్త మార్గదర్శకాలు సుపరిపాలన ప్రక్రియను సరళీకృతం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు అత్యంత అవసరమైన, మౌలిక సదుపాయాలను త్వరగా, పారదర్శకంగా అమలు చేయడంలో ఈ సంస్కరణలు సహాయపడతాయన్నారు. కొత్త 'ఎమ్మెల్యే ఎల్‌ఏడీ వెబ్ పోర్టల్' ఆధ్వర్యంలో ప్రాజెక్టు సిఫార్సులు, ప్రాజెక్ట్ అవసరాల అంచనా, ప్రణాళిక , వ్యయ అంచనా తయారీ, ప్రాజెక్టుల ఆమోదం, పని ఆదేశాలు, పర్యవేక్షణ, తనిఖీ, వ్యయం, పని అమలు మొదలైన వాటిని ఎమ్మెల్యేలు సకాలంలో పూర్తి చేసేందుకు వీలవుతుందన్నారు. తాజా సరళీకరణతో ప్రాజెక్టు సిఫార్సు, వర్క్ ఆర్డర్‌ల జారీ మధ్య సమయాన్ని 30 రోజులకు పరిమితం చేశామన్నారు. ఇది వేగవంతమైన అమలును నిర్ధారిస్తుందన్నారు. శాసనసభ్యులు వెబ్ పోర్టల్ ఆధ్వర్యంలో ప్రాజెక్టుల సిఫార్సు, ఆమోదాల పర్యవేక్షణ, అమలును ప్రత్యక్షంగా పరిశీలించేందుకు సౌకర్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. జవాబుదారీతనాన్ని గుర్తించి నియోజకవర్గం బహుముఖ అభివృద్ధి ప్రతిపాదనల వాస్తవ కార్యాచరణలో జాప్యం నివారణకు ఈ పోర్టల్ దోహదపడుతుందన్నారు. 1997–98లో ప్రారంభమైన ఎమ్మెల్యే–ఎల్‌ఏడీ పథకం స్థానిక మౌలిక సదుపాయాల అవసరాలను తీర్చడానికి కీలకమైన సాధనంగా అభివృద్ధి చెందిందన్నార9ఉ. 2025–26లో నియోజకవర్గానికి వార్షిక కేటాయింపును రూ.5 కోట్లకు పెంచామన్నారు. ఇది స్థానిక ప్రతినిధులకు సాధికారత కల్పించడంలో ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. ఎమ్మెల్యేల అభిప్రాయాలను, పొరుగు రాష్ట్రాల ఉత్తమ పద్ధతుల సమాహారంతో ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ అహూజా, రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ అనూ గర్గ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో సరళీకృత మార్గదర్శకాలను రూపొందించామన్నారు. సంస్కరణ ప్రక్రియలో పాల్గొన్న అన్ని వర్గాల వారికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంస్కరణ అభివృద్ధిని వేగవంతం చేయడంలో డిజిటల్ పాలన ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుందన్నారు. పరిపాలనా ప్రక్రియలను క్రమబద్ధీకరించి జాప్యం నివారణతో నియోజకవర్గాలలో అభివృద్ధి ప్రాజెక్టులను సకాలంలో అమలు చేయడం ఈ కొత్త డిజిటల్ ప్లాట్‌ఫామ్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ అనూ గర్గ్ పోర్టల్ యొక్క లక్ష్యాలు, కొత్త మార్గదర్శకాల యొక్క అవలోకనాన్ని సమర్పించారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు గంగుబూడి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ తదితరులు

లక్కవరపుకోట : మండలంలోని గంగుబూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఇటీవల లక్కవరపుకోట మండల కేంద్రం ఏపీ మోడల్ స్కూల్ మైదానంలో జరిగిన ఎంపికలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల పీడి గాడి రవి కుమార్ బుధవారం తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో గొర్లె పూర్ణచందు, జూనియర్స్ విభాగంలో వానపల్లి మనోజ్ ఎంపికైనట్టు పేర్కొన్నారు. వీరు ఈ నెల 29 నుంచి 31వ తేది వరకు ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు నుంచి ఆడుతారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు శారదాదేవి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వి.వి.జి.మంగరాజు తదితరులు అభినందించారు.

మారెడుబాకలో ఇరు వర్గాల కొట్లాట



ఎస్ఐకు దాడి ఘటనపై వివరిస్తున్న బాధితురాలు

రాజాం సిటీ: మండల పరిధి మారెడుబాక గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన ఇరువర్గాల కొట్లాటలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జరజాన కోటేశ్వరరావు, వర్రి రామకృష్ణల మధ్య చెలరేగిన స్థల వివాదం కొట్లాటకు దారితీసింది. వర్రి రామకృష్ణతో పాటు మరో తొమ్మిది మంది జరిపిన దాడిలో జరజాన కోటేశ్వరరావుతో పాటు సునీత, లత, కుంచి నిర్మల, రాయ లక్ష్మి గాయాల పాలయ్యారు. వెంటనే స్థానికులు వీరిని రాజాం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనకు సంబంధించి బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు.

ప్రేమ పేరుతో మోసగించిన యువకుడు అరెస్టు

తెర్లాం: ఓ యువతిని ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన కేసుకు సంబంధించి యువకుడిని అరెస్టు చేసినట్టు బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గొలుగువలస గ్రామానికి చెందిన సిరిపురపు వెంకటరమణ, అదే గ్రామానికి చెందిన యువతి గత కొన్నేళ్లుగా ప్రేమించుకున్నారు. ఆ యువకుడు తనను ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించి పెళ్లి చేసుకోమని కోరినప్పుడు పెళ్లి చేసుకొనేందుకు నిరాకరించాడని, వేరొక యువతిని పెళ్లి చేసుకున్నానని చెప్పడంతో ప్రేమించిన యువతి తాను మోసపోయానని, తనకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకునిపై నమ్మించి మోసం చేసినట్టుగా తెర్లాం ఎస్ఐ బి.సాగర్ బాబు కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు నిర్వహించిన బొబ్బిలి రూరల్ సీఐ యువతిని ప్రేమించి, మోసగించిన యువకుడిని అరెస్టు చేసి బొబ్బిలి కోర్టులో హాజరుపరచినట్టు తెలిపారు.

సెప్టెంబర్ 14న పౌరాణిక ఏకపాత్రాభినయ పోటీలు

పార్వతీపురం రూరల్: ఉత్తరాంధ్ర స్థాయిలో పౌరాణిక ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించనున్నట్టు శ్రీ వాణి ఆర్ట్స్ వ్యవస్థాపకులు డాక్టర్ పీజీ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం పట్టణంలో గల లయన్స్ కల్యాణ మండపం వేదికగా సెప్టెంబర్ 14వ తేదీన ఆదివారం ఉదయం 8 గంటలకు ఈ పోటీలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు పోటీలలో పాల్గొనేందుకు ఆగస్టు 25లోగా ప్రవేశ రుసుము రూ.200 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు ప్రత్యేక స్థానాలుగా గుర్తించి ప్రతిభ కనబరిచిన కళాకారులకు జ్ఞాపికతో పాటు నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఫోన్ ద్వారా నమోదు చేసుకునేందుకు 8186076044, 9849833439, 9948128766 నంబర్లను సంప్రదించాలని కోరారు. శ్రీ వాణి ఆర్ట్స్ 12వ వార్షికోత్సవ సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

20న స్థాయీ సంఘ సమావేశాలు

విజయనగరం: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్నట్టు జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో 1–7 స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు.

దేవుడితో కూటమి ఆటలు

- ట్రస్టుబోర్డు నియామకంలో కుంపట్లు
- వంశపారంపర్య, వ్యవస్థాపక ధర్మకర్తలకు మొండిచేయి
- నిన్న నవదుర్గామాత ఆలయం..
- నేడు పోలిపల్లిపైడితల్లి ఆలయం



వివాదాస్పదంగా మారిన నవదుర్గామాత ఆలయ ట్రస్టు కమిటీ ఎన్నిక

రాజాం: దేవుడితోను..దేవస్థానాలతోను కూటమి ఆటలు ఆడుతోంది. చోటా మోటా కార్యకర్తలు, నాయకుల మాటలకు దేవాదాయశాఖ తల ఊపుతోంది. నిబంధనలు ఉల్లంఘించి రాజకీయాలు చేస్తోంది. దేవాలయాల ట్రస్టు బోర్డు నియామకంలో సిఫార్సులకు అనుగుణంగా వ్యవహరిస్తోంది. రాజకీయాలు చేసి, భక్తుల మనోభావాలు దెబ్బతీస్తోంది. హైందవ ధర్మాన్ని అటకెక్కించే పనిలో పడింది. రాజాంలో నిన్న నవదుర్గామాత ఆలయ ట్రస్టుబోర్డు కమిటీ నియామకంలో నిబంధనలు ఉల్లంఘించిన దేవాదాయశాఖ, ప్రస్తుతం నోటిఫికేషన్ ఇచ్చిన పోలిపల్లి పైడితల్లి ఆలయం ట్రస్టు బోర్డు నియామకంలో కూడా వివాదాలకు తావిచ్చింది.

గతంలో ఎన్నడూ లేని విధంగా..

ఆలయ ట్రస్టు బోర్డులు, అభివృద్ధి కమిటీల ఏర్పాటులో గత ప్రభుత్వాలు రాజకీయ జోక్యం చేసుకోలేదు. ఇప్పుడు అలా కాకుండా కూటమి కుంపటి పెడుతోంది. రాజాం బస్టాండ్ ఆవరణలోని నవదుర్గామాత ఆలయ ట్రస్టు బోర్డు ఎంపిక పక్షం రోజుల క్రితం జరిగింది. ఆ బోర్డులో ఆలయ వ్యవస్థాపక కుటుంబానికి చెందిన ధర్మకర్తను చైర్మన్‌గా ఉంచాల్సి ఉండగా, ఆయనను తొలగించి, రాజాం పట్టణ పరిధిలోని సారథి గ్రామానికి చెందిన ఓ టీడీపీ కార్యకర్త పేరును ప్రకటించింది. దీంతో ఇక్కడ పెద్దస్థాయిలో వివాదం చెలరేగడంతో పాటు వ్యవస్థాపక ధర్మకర్తలు ఈ నియామకాన్ని తిరస్కరించడంతో ప్రస్తుతం ఈ బోర్డు ఎంపిక వివాదాస్పదంగా మారి గాలిలో ఉంది. గతంలో ఈ బోర్డు ఎంపికలో ఇటువంటి ఇబ్బందులు రాలేదని, వ్యవస్థాపక ధర్మకర్త వానపల్లి తమ్మయ్య గురువు కుమారుడు వానపల్లి నర్సింగరావు తెలిపారు. ధర్మకర్త కుటుంబానికి చెందిన చైర్మన్‌గా ఉంటారని, మిగిలిన సభ్యులను దేవాదాయశాఖ నియమించాల్సి ఉందని తెలిపారు. గత ప్రభుత్వాలు ఈ విధానంలోనే చైర్మన్‌గా ధర్మకర్తను కొనసాగించి, ఆలయ అభివృద్ధికి సహకరించిన మిగిలిన భక్తులకు కమిటీలో చోటు కల్పించేవారని వెల్లడించారు.



పోలిపల్లిపైడితల్లి ట్రస్టుబోర్డు ఎంపికలో కూడా రాజకీయమే

ఈ దఫా ఈ నిబంధనలు అటకెక్కించి, ఆలయానికి రానివారిని, ఆలయం అంటే తెలియని వారిని సభ్యులుగా పెట్టిన పరిస్థితి ఉందన్నారు.

తాజాగా మరో వివాదం

ఇదిలా ఉండగా ఇప్పుడు పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు ఎంపికకు దేవాదాయశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. ఇందులో ట్రస్టు చైర్మన్ పదవిని ఖాళీ ఉంచి, మిగిలిన కమిటీకి నోటిఫికేషన్ ఇవ్వాలి. అలాకాకుండా మొత్తం కమిటీకి దరఖాస్తులు ఆహ్వానించడంతో వివాదం ప్రారంభమైంది. కొన్నేళ్లుగా ఇక్కడ ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్‌గా ఆలయ ధర్మకర్త కుటుంబానికి చెందిన వాకచర్ల కుటుంబీకులే వ్యవహరిస్తున్నారు. గతేడాది వరకూ ధర్మకర్త కుమారుడైన వాకచర్ల దుర్గాప్రసాద్ చైర్మన్‌గా వ్యవహరించారు. పైడితల్లి అమ్మవారి ఆలయానికి సంబంధించి అన్ని ఉత్సవాల్లో వారి భాగస్వామ్యం ఉంటుంది. అటువంటి ధర్మకర్త కుటుంబాన్ని పక్కన పెట్టి, కొత్తవారికోసం నోటిఫికేషన్ ఇవ్వడంతో ఇక్కడ వివాదం ప్రారంభమై, దేవాదాయశాఖ తీరుతో పాటు కూటమి ప్రభుత్వ తీరుపై భక్తులు విమర్శలు చేస్తున్నారు. ఇంతటి దురదృష్టకర పాలనను ఇంతకు ముందు చూడలేదని బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఈ కమిటీ ఎన్నిక ఎలా జరుగుతుందో చూస్తామని హెచ్చరిస్తున్నారు.

నిబంధనలు మారాయి



పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు కమిటీ ఎంపిక నోటిఫికేషన్ ఉన్నతాధికారులనుంచి వచ్చింది. గతంలో వంశపారంపర్య ధర్మకర్తలే చైర్మన్‌లుగా ఉండేవారు. ఇప్పుడు కొత్త నిబంధనలు అమలులోకి వచ్చాయి. ఇక్కడ పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకే నియామకం ఉంటుంది. నా చేతిలో ఏమీలేదు. బీవీ మాధవరావు, దేవాదాయశాఖ రాజాం మేనేజర్

జర్మన్ భాషపై ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య



జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య

పార్వతీపురం టౌన్: జర్మనీ దేశంలో అసిస్టెంట్ నర్సు ఉద్యోగాలు పొందేందుకు జిల్లాలోని జి.ఎన్.ఎమ్ చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు జర్మన్ భాషపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓంకాప్, టి.ఎస్.ఏ.ఐ సంయుక్త ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో శిక్షణ ఉంటుందని వివరించారు. తప్పనిసరిగా జి.ఎన్.ఎమ్ పూర్తి చేసి ఏడాది పాటు సాధారణ ఆసుపత్రుల్లో అనుభవం కలిగి 39 ఏళ్లలోపు వయసున్న వారు జర్మన్ భాష నేర్చుకోవడానికి అర్హులని తెలిపారు. శిక్షణ రోజుకు 2 నుంచి 3 గంటల పాటు సుమారు 8 నెలల వరకు ఉంటుందని అన్నారు. ఇందులో ఏ1, బీ2 లాంగ్వేజ్‌లపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు రూ.30,000లు సెక్యూరిటీ డిపాజిట్ చేసి, జర్మనీ వెళ్లేందుకు విమాన చార్జీలు, బీ2 పరీక్ష ఫీజు, వీసా చార్జెస్ చెల్లించాలన్నారు. శిక్షణ పూర్తి చేసి బీ2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి నెలకు రూ.2 లక్షల నుంచి 2,50,000ల వరకు జీతం చెల్లిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 7032060773 నంబరును సంప్రదించి తెలుసుకోవచ్చని తెలిపారు.

ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంక్షేమ, ప్రజా సంఘాల నాయకులు

పార్వతీపురం రూరల్ : మూడవసారి అధికారంలోకి వచ్చిన కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశంలో రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ రైతుకు ద్రోహం చేస్తున్నదని పలు రైతు సంక్షేమ, రైతుకూలి, ప్రజా సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రైతు, కార్మిక నల్ల చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో వ్యవసాయ రంగంలోకి 'కార్పొరేట్' సంస్థలను తీసుకువచ్చే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. పంటలు పండే భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా ఇవ్వడం సరికాదన్నారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ బంటు దాసు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఈవీ నాయుడు, రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ నాయకులు పి.శ్రీనునాయుడు, కృష్ణవేణి, ఎం.భాస్కరరావు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు పి.సంగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తిన మోహన్, గేదెల రామకృష్ణ, వంగల దాలినాయుడు, ఏఐటీయూసీ నాయకులు ఆర్‌వీఎస్ కుమార్, దుర్గారావు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, తాడంగి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి బోల్తా పడిన పొక్లెయినర్

- ఒకరి మృతి



మృతి చెందిన ట్రాలీ డ్రైవర్ ప్రమోద్‌కుమార్

మెంటాడ: మండలంలో వాణిజి గ్రామం నుంచి అనంతగిరి మండలం బూరుగ గ్రామానికి రోడ్డు వేసే పనులు జరుగుతున్నాయి. మంగళవారం పనులు పూర్తయిన తరువాత పొక్లెయినర్‌ను ట్రాలీపైకి ఎక్కిస్తుండగా అదుపు తప్పి లైటింగ్ చూపిస్తున్న బీహార్‌కు చెందిన ట్రాలీ డ్రైవర్ ప్రమోద్‌కుమార్, మెంటాడకు చెందిన తాడ్డి రాంబాబులపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ట్రాలీ డ్రైవర్ ప్రమోద్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, తాడ్డి రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకొని సంఘటనా స్థలానికి ఎస్ఐ సీతారాం చేరుకుని గాయాల పాలైన రాంబాబును జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. మృతి చెందిన ప్రమోద్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సీతారాం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మరణించిన కెమిస్ట్ వలిపల్లి సుధాకర్

డెంకాడ: మండలంలోని చింతలవలస వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం మండలంలోని ధర్మపురి గ్రామానికి చెందిన వలిపల్లి సుధాకర్(37) దివీస్ కంపెనీలో కెమిస్ట్‌గా పని చేస్తున్నాడు. బి షిఫ్ట్ కావడంతో బుధవారం మధ్యాహ్నం ధర్మపురి నుంచి తగరపువలస సమీపంలో ఉన్న దివీస్ కంపెనీకి వెళ్తుండగా.. చింతలవలస గ్రామం వద్ద ఎదురెదురుగా రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. దీనిలో వలిపల్లి సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన సుధాకర్‌ను చికిత్స నిమిత్తం విజయనగరం కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు డాక్టర్లు తెలిపారని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు.

19న ఐద్వా మహాసభలు



ఐద్వా 9వ మహాసభలపై ప్రచారం నిర్వహిస్తున్న మహిళలు

విజయనగరం గంటస్తంభం: విజయనగరంలో ఈ నెల 19న జరిగే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా 9వ మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.రమణమ్మ కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక రామకృష్ణనగర్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో విలేకర్లతో ఆమె మాట్లాడారు. మహిళా హక్కులు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్, అధిక ధరలకు వ్యతిరేకంగా, ప్రజాసమస్యల పరిష్కారం కోసం మహిళలపై జరిగే దాడులు, హత్యలు, ఆత్యాచారాలు, లైంగిక, వరకట్న వేధింపులు, స్త్రీ వివక్ష, డ్వాక్రా మహిళల సమస్యలు, మైక్రోఫైనాన్స్, మద్యం, గంజాయి, డ్రగ్స్, అశ్లీలత మొదలైన సమస్యలపై జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు, పోరాటాలు ఐద్వా నిర్వహిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా జాప్యం చేయడం సరైంది కాదని వెంటనే ప్రతి మహిళకు రూ.1500 పథకం అమలు చేయాలన్నారు. అన్ని సర్వీసుల్లో రాష్ట్రం మొత్తం ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు

విజయనగరం క్రైమ్ : రోడ్డు ప్రమాదాల నివారణకే డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా చేపట్టామని ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలిపారు. ఈ నెల 4 నుంచి 10 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. ఇందులో మద్యం సేవించి వాహనాలు నడిపిన వాహనదారులపై 295 కేసులు నమోదు చేశామని వెల్లడించారు. రహదారి భద్రతలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో బ్లాక్ స్పాట్‌లు, ముఖ్య కూడళ్ల వద్ద విస్తృతంగా ఈ తనిఖీలు చేపట్టామని పేర్కొన్నారు. రహదారి భద్రత నియమాలను అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రత్యేక డ్రైవ్‌ను విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్య రెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘువులు, సంబంధిత సీఐలు పర్యవేక్షించారని పేర్కొన్నారు.

ఆటల్లో సత్తా చాటిన పాఠశాలలకు పురస్కారాలు

- ఈ నెల 18 లోగా దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం
- జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 5 పాఠశాలలకు దక్కనున్న అవార్డులు
- స్కూల్ గేమ్స్ క్రీడలో ప్రతిభ చూపిన వారికి అవకాశం



ఆటలాడుతున్న క్రీడాకారులు

విజయనగరం: ఆటల్లో మేటిగా నిలిచే క్రీడాకారులున్న పాఠశాలలకు పురస్కారాల పంట పండనుంది. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఐదు ఉత్తమ పాఠశాలలకు క్రీడా ప్రతిభా పురస్కారాలు అందజేయాలని, ఆ మేరకు దరఖాస్తులు ఆహ్వానించాలని పాఠశాల విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 18లోగా డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలి. 19న దరఖాస్తుల పరిశీలన, 20న అభ్యంతరాల స్వీకరణ, 21న తుది జాబితా ప్రకటిస్తారు.

విద్యార్థులకు ప్రోత్సాహం..

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు పాఠశాలలకు ఏటా పురస్కారాలు అందజేస్తున్నారు. ఈ ఏడాది హాకీ క్రీడాకారుడు ధ్యానచంద్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ నెల 29న పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. ఆ రోజు అన్ని పాఠశాలల్లో ఆటల పోటీలు నిర్వహించనున్నారు.

క్రీడా ఫలితాల ఆధారంగా..

ఉత్తమ పాఠశాలల ఎంపికకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీని నియమించనున్నారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో ఐదు మంది సభ్యులుగా ఉంటారు. జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి అత్యధిక విజయాలు సాధించిన పాఠశాలల్లో ఐదింటిని కమిటీ గుర్తిస్తుంది. ఇందుకు ప్రతి క్రీడలో అత్యధిక స్కోరును పరిగణనలోకి తీసుకుంటారు. 2024 - 2025కు సంబంధించిన క్రీడా ఫలితాల ఆధారంగా జిల్లాలో ఐదు ఉత్తమ పాఠశాలలకు పురస్కారాలు ప్రదానం చేస్తారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రదర్శనలు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. పాఠశాల విద్యా శాఖ పరిధిలోని అన్ని బడుల యాజమాన్యాలు దరఖాస్తు చేసుకోవచ్చు. వీటితో ప్రధానోపాధ్యాయుడు, పీఈటీ సంతకంతో క్రీడాకారులు సాధించిన ధ్రువపత్రాల నకళ్లతో ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన పాఠశాలలకు 29న జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేస్తారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు.

గంజాయితో సంపాదించిన ఆస్తులు ఫ్రీజ్ : ఎస్పీ



గంజాయి వ్యాపారి బాలరాజు ఆస్తుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైమ్ : ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన గంజాయి వ్యాపారి నగేష్ అలియాస్ బాలరాజుకు చెందిన రూ.56 లక్షల విలువైన ఆస్తులను ఫ్రీజ్ చేశామని ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలిపారు. జిల్లాలోని ఎస్.కోట పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి కేసులో నిందితుడిగా అరెస్టు అయిన నగేష్ ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పంత్లున్గా పంచాయత్ నందాపూర్ మండలం భాకాపుట్ గ్రామానికి చెందిన వాడని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాతో సంపాదించిన సుమారు రూ.56 లక్షల విలువైన స్థిర, చరాస్తులను అటాచ్ చేశామని పేర్కొన్నారు. గంజాయి వ్యాపారుల నుంచి అతని భార్య జమున బ్యాంకు ఖాతాకు పలుమార్లు రూ.6.53 లక్షల నగదు జమ అయినట్టు తమ విచారణలో తేలిందని తెలిపారు. నిందితుడు సంపాదించిన అక్రమ ఆస్తులను ఎవరికీ విక్రయించకుండా చట్ట పరిధిలో ఫ్రీజ్ చేసినట్టు నోటీసులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. ఫ్రీజ్ చేసిన ఆస్తులు కొల్‌కత్తాలోని కాంపిటెంట్ అథారిటీ పరిధిలోకి వెళ్లాయని, సదరు ఆస్తులను ఎవరు కొనుగోలు చేసినా చెల్లనేరవని ప్రజలు దీన్ని గుర్తించాలని ఎసీ కోరారు. ఈ ప్రక్రియలో క్రియాశీలకంగా పని చేసిన అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్.కోట ఇన్‌స్పెక్టర్ వి.నారాయణమూర్తి ఇతర పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు.

రెండు తులాల బంగారం కోసం చిన్నాన్నని చంపేశాడు..

- నాటు తుపాకీతో హత్య చేసిన వ్యక్తి అరెస్టు
- వివరాలు వెల్లడించిన విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు



నిందితుడు సిమ్మ అప్పారావుని విలేకరుల ముందు హాజరుపరచి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

కొత్తవలస : కేవలం రెండు తులాల బంగారం కోసం జరిగిన వివాదం వరసకు చిన్నాన్న అయిన సిమ్మ అప్పారావును నాటు తుపాకీతో కాల్చి చంపడానికి దారి తీసిందని విజయగనరం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ముసిరాం గ్రామానికి చెందిన సిమ్మ అప్పారావు(70)ను తన మేనకోడలు భర్త అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం పాతవలస గ్రామానికి చెందిన సిమ్మ అప్పారావు(36) ఈ నెల 5వ తేదీన అతి సమీపం నుంచి నాటు తుపాకీతో కాల్చి చంపిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ మేరకు గ్రామానికి చెందిన సిమ్మ శివకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సిహెచ్.షణ్ముఖరావు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా నిందితుడు సిమ్మ అప్పారావును కోటపాడు రోడ్డు సీతంపేట గ్రామ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు స్థానిక విలేకరుల ముందు నిందితుడిని హాజరుపరిచి వివరాలను విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు వివరించారు. నిందితుడు అప్పారావు భార్య ఏడాదిన్నర క్రితం మృతి చెందింది. ఆమెకు సంబంధించిన బంగారం, భూమి ఇతర ఆస్తులు మేనమామ అయిన మృతుడు సిమ్మ అప్పారావు వద్ద ఉన్నట్టు తెలిపారు. సదరు బంగారం, భూమి ఇవ్వాలని నిందితుడు అప్పారావు మృతుడు అప్పారావుని పలుమార్లు అడిగాడు. అయినా బంగారం ఇవ్వకపోవడంతో ఈ నెల 5న నిందితుడు తన స్వంత ఆటోలో ముసిరాం వచ్చి మరోసారి బంగారం ఇవ్వమని అడిగాడు. ఆయన నిరాకరించడంతో తనతో పాటు తెచ్చుకున్న నాటు తుపాకీతో గుండెపై కాల్చడంతో అప్పారావు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో నిందితుడు అక్కడ నుంచి పరారయ్యాడని తెలిపారు. సీతంపేట వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. తుపాకీ కోసం విచారించగా పాతవలస సమీపంలో వుంచినట్లు తెలపగా తుపాకీని స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసిన సీఐ సిహెచ్.షణ్ముఖరావు, ఎస్ఐ పి.ప్రసాద్‌రావు, పీసీలు ఎల్.రమేష్, దేముడు తదితరులను అభినందించారు. రివార్డులకు సిఫార్స్ చేస్తామని తెలిపారు.

జిల్లాలో రూ.26 కోట్ల అంచనాతో 44 జలవనరులు పనులు

- జిల్లా స్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీలో ఆమోదం తెలిపిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

విజయనగరం అర్బన్: జల వనరుల శాఖ ద్వారా రిపేర్, రెనోవేషన్, రెస్టరేషన్ ఆర్ఆర్ఆర్ కింద రూ.26 కోట్ల అంచనాతో 44 పనులను జిల్లా ఇంప్లిమెంటేషన్ కమిటీలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆమోదం తెలిపారు. నీటి వనరుల పునరుద్ధరణ, పరిరక్షణ, ఆక్రమణల నుంచి రక్షించడం, తాగునీటి లభ్యతను పెంచడం, భూగర్భ జలాల రీచార్జ్‌కు ఉద్దేశించిన ఈ పథకం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించనున్నాయని కలెక్టర్ తెలిపారు. బుధవారం కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ ప్రతిపాదనలను టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆమోదం పొందిన తర్వాత పనులు ప్రారంభం అవుతాయని కలెక్టర్ తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు కేటాయిస్తాయని అన్నారు. ఈ పనులకు ఆమోదం లభిస్తే జిల్లాలో 6,873 ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్ ఈఈ ఎంవీ రమణ, గ్రౌండ్ వాటర్ డీడీ ప్రవీణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, సెంట్రల్ వాటర్ కమిషన్ ఏడీ సంజీవ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంఎస్ పరిశ్రమ ఉద్యోగి మృతి



పరిశ్రమ గేటు ఎదురుగా మృతదేహంతో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



మృతుడు శ్రీనివాసరావు (ఫైల్)

పూసపాటిరేగ : మండలంలోని ఎస్ఎంఎస్ పరిశ్రమ ఉద్యోగి విధి నిర్వహణలో వుండగా అస్వస్థతకు గురవడంతో ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పూసపాటిరేగ మండలం వెంపడాం గ్రామానికి చెందిన పిన్నింటి శ్రీనివాసరావు (26) ఎస్ఎంఎస్ పరిశ్రమలో కెమిస్ట్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఏ షిఫ్టుకు హాజరైన శ్రీను విధులు నిర్వహిస్తుండగా ఆకస్మాత్తుగా సొమ్మసిల్లి పడిపోయాడు. సొమ్మసిల్లిన శ్రీనివాసరావును చికిత్స నిమిత్తం విజయనగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. పరిశ్రమ ఉద్యోగి మృతి చెందడంతో గ్రామస్తులు, మృతుని బంధువులతో మృతదేహం అంబులెన్సులో వుంచి పరిశ్రమ గేటు ఎదురుగా ఆందోళనకు దిగారు. దీనిపై యాజమాన్య ప్రతినిధులు స్పందిస్తూ పరిశ్రమలో ఎటువంటి ప్రమాదం జరగలేదని, అస్వస్థతకు గురవడంతో ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్టు తెలిపారు. దీంతో పరిశ్రమ ఉద్యోగికి న్యాయం చేయాలని గ్రామస్తులు, మృతుని బంధువులు పట్టుబట్టడంతో యాజమాన్య ప్రతినిధులు రూ.20 లక్షలు పరిహారం ఇవ్వడానికి అంగీకరించడంతో వివాదం సద్దుమణిగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం ఎస్ఐలు ఐ.దుర్గాప్రసాదు, ఎ.సన్యాసినాయుడు, పాపారావు సిబ్బందితో పాటు గేటు వద్ద బందోబస్తు నిర్వహించారు.